

నూతన బార్ పాలసీ గెజిట్ విడుదల

పార్వతీపురంటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నూతన బార్ పాలసీ గెజిట్ విడుదలైనట్లు ఏఈఎస్ సంతోష్ తెలిపారు. సోమ వారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో మాట్లాడుతూ.. 'మూడేళ్ల పాటు బార్‌ల నిర్వహణకు గాను ఈనెల 26 వరకు పార్వతీపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరిస్తాం. పార్వతీ పురంలో 4, పాలకొండ 1, సాలూరులో 3 బార్ షాపులు, సెగిడి వారికి పార్వ తీపురం, శ్రీసైన వారికి పాలకొండలో దుకాణాలు కేటాయించాం. 28న కలెక్టర్ చేతుల మీదుగా లాటరీ వేసి బార్‌లతో పాటు షాపులను మంజూరు చేస్తాం.' అని తెలిపారు.

చిత్రం.. ఓ జ్ఞాపకం



తనయుడితో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

● సాంకేతికత పెరిగినా క్రేజ్ తగ్గని వైనం

పార్వతీపురం, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): కరిగిపోయే కాలంలో చెరిగిపోని మధుర జ్ఞాపకాలకు ప్రతిబింబాలే ఫొటోలు. ప్రతి ఫొటో వెనుక ఎన్నో తీపిగుర్తులు. వంద భావాలను కూడా ఒక్క చిత్రంతో చెప్పొచ్చు. అందుకే నేటి డిజిటల్ యుగంలోనూ ఫొటోగ్రఫీ జోరు కొనసాగుతోంది. దాని క్రేజ్ ఏ మాత్రం తగ్గడం లేదు. స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరిగిన తర్వాత ప్రతిఒక్కరూ ఫొటోలు, సెల్ఫీలు తీయడంపై ఆసక్తి చూపుతున్నారు. నేడు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ ఫోన్లతో క్లిక్‌మనిపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం తమ మధుర స్మృతులను ఫొటోల రూపంలో భద్రపరుస్తున్నారు. వాటిని మళ్లీ మళ్లీ వీక్షించి తనివితీరా ఆనందం పొందుతున్నారు. ఎన్నో అనుభూతులను పంచే ఫొటోలు ప్రతిఒక్కరి జీవితంలోనూ ఎంతో ప్రత్యేకం.

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

6లో



కలెక్టర్ క్లిక్‌మనిపించిన ఓ ఫొటో

- జిల్లాలోని పలు ప్రాంతాల్లో జోరువాన
- ఉప్పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు
- నీటమునిగిన పంట పొలాలు
- ప్రాజెక్టులకు వరద
- నేడూ భారీ వర్షాలు కురిసే అవకాశం
- అధికార యంత్రాంగం అప్రమత్తం
- పాఠశాలలకు సెలవు



పాలకొండ: వీపీరాజుపేటలో నీటమునిగిన పంట పొలాలు

కుండపోత

వర్షపాతం ఇలా..

పార్వతీపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గత 24 గంటల్లో చూసుకుంటే 40.6 మిల్లీమీటర్ల మేర పాలకొండమండలంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. కొమరాడ మండలంలో 39.2 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. ఇక సోమవారం కురుపాం మండలంలో 17.2 మిలీమీటర్లు, వీరఘట్టం 12.6, పాలకొండ 4.2, సీతంపేట 5.2, గుమ్మలక్ష్మీపురం 4.2, జియ్యమ్మవలస 7.6, పార్వతీపురం 5.8, కొమరాడ 9.2, బలిజిపేట 8.2, పాచిపెంట 2.2, గరుగుబిల్లి 5.2, మక్కువ 3, సీతానగరం 2.8, భామిని, సాలూరులో సున్నా వర్షపాతం నమోదైంది.



భామిని సమీపంలో రోడ్డు ఇలా..

పార్వతీపురం/పాలకొండ/భామిని, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో జోరువానలు కురుస్తున్నాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. దీంతో గెడ్డలు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరి పొలాలు నీటమునిగాయి. నిన్నమొన్నటి వరకు సాగునీటి కష్టాలు ఎదుర్కొన్న రైతులు నేడు భారీ వర్షాల కారణంగా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరి పైరు ముంపునకు గురవడంతో తొలి దశలోనే పంటకు నష్టం వాటిల్లే ప్రమాదముందని వాపోతున్నారు. పాలకొండల మండల పరిధిలో ఓనిగెడ్డ, రావాడగెడ్డ, తంపరగెడ్డ, ఒట్టిగెడ్డకు వరద పోటెత్తగా.. కొండవాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పాలకొండ, తంపటాపల్లి, చిన్న మంగళాపురం, గొట్టమంగళాపురం, వీపీరాజుపేట, తుమరాడ తదితర గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ప్రస్తుతం వందలాది ఎకరాలు చెరువులను తలపిస్తున్నాయి వరదనీరు తగ్గితేగాని పంటను కాపాడుకోలేమని రైతులు వాపోతున్నారు. రెండు మూడు రోజులు పాటు నీరు నిల్వ ఉంటే వరిపైరు కుళ్లిపోయే ప్రమాదముందని వారు చెబుతున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడతాయని వాతావరణశాఖ చెప్పడంతో అన్నదాతలు దిగులు చెందుతున్నారు. పాలకొండ పట్టణంలో ప్రధాన రహదారిపై వరదనీరు ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించలేకపోయారు. భామిని మండలం బిల్లుమడ నుంచి బత్తిలి వరకు 8 కిలోమీటర్లు మేర రహదారిపై గోతుల్లో వర్షం నీరు చేరింది. దీంతో అటువైపుగా ప్రయాణాలు చేయలేని పరిస్థితి ఏర్పడింది.



గరుగుబిల్లి: నాగావళిలో వరద ప్రవాహం

సీతంపేట మన్యంలో...

సీతంపేట రూరల్: సీతంపేట ఏజెన్సీలో సోమవారం కురిసిన భారీ వర్షానికి కుసిమి, సంతమల్లి గ్రామాల మధ్యలో ఉన్న గెడ్డ ఉప్పొంగింది. దీంతో రహదారిపై వరదనీరు చేరడంతో

(మిగతా 8వ పేజీలో...)

నేడు భారీ వర్షాలు : కలెక్టర్

పార్వతీపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావంతో రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు పడతాయని, ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సూచించారు. మంగళవారం గంటకు 30-40 కిలోమీటర్లు వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. సోమ వారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే సమయంలో చెట్లు, టవర్స్ పోల్స్ పొలాలు, బహిరంగ ప్రదేశాలు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, గృహాల్లో ఎవరూ ఉండకుండా చూడాలన్నారు. ప్రజలు సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని, వర్షాలు వేళ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలలో ఉన్న విద్యార్థుల ఆరోగ్యాలపై శ్రద్ధ వహించాలన్నారు. కాగా నేడు పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఉన్నతాధికారులు రాకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.

నేడు జిల్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాక

పార్వతీపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మంగళవారం జిల్లాకు రానున్నారు. జిల్లాకేంద్రం పార్వతీపురంలో నిర్వహించనున్న పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొనున్నారు. అనంతరం శ్రేణులతో సమావేశం కానున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా మాధవ్ మన్యం జిల్లాకు వస్తుండడంతో కార్యకర్తలు, నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

మక్కువ-సాలూరు
ఆర్టీసీ బస్సుల నిలిపివేత
8లో

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
● ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి జగన్మోహనరావు
8లో

లోతట్టు ప్రాంతాలపై
ప్రత్యేక దృష్టి
● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

సచివాలయ సిబ్బంది
అందుబాటులో ఉండాలి
● పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ
8లో

ఏజెన్సీలో విజృంభిస్తున్న
విష జ్వరాలు
● సీతంపేట ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి
8లో



సొంత నేలపై ప్రవాసుల ఔదార్యం

- సౌదీలో ఉంటూనే స్వగ్రామానికి సేవలు
- పార్వతీపురం జిల్లా రావుపల్లి గ్రామంలో..
- మౌలిక సౌకర్యాల కల్పన, భవన నిర్మాణాలు
- 'ఆశయ' పేరిట సహాయక బృందం ఏర్పాటు
- యువతకు శిక్షణ.. ఉద్యోగాల కల్పనకు కృషి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి):

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అంటున్నారు.. పార్వతీపురం మన్యం జిల్లాలోని ఓ కుగ్రామానికి చెందిన ప్రవాసీయులు. కనీస మౌలిక వసతులు కూడా లేని గరుగుబిల్లి మండలం, రావుపల్లి గ్రామం నుంచి అనేక వ్యయ ప్రయాస లకు ఓర్చుకుని విదేశాలకు వెళ్లిన వీరు తాము ఎదుగుతూ.. తమ సొంత గ్రామానికి కూడా సేవలందిస్తున్నారు. రావుపల్లి గ్రామానికి చెందిన కొంత మంది యువకులు సౌదీ అరేబియా, ఖతర్ దేశాలలోని చమురు, గ్యాస్ ఉత్పాదక సంస్థలలో సమర్థవంతులైన ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. అంతేకాదు, ఈ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గల్ఫ్(సౌదీ అరేబియా), ఐరోపా(స్విట్జర్లాండ్)లలోని తెలుగు ప్రవాసీ సంఘాలకు నేతృత్వం కూడా వహిస్తున్నారు. ఏదేశమేగినా.. ఎందు కాలిడినా.. అన్నట్టు వీరంతా తాము పుట్టి పెరిగిన నేలను అభిమానిస్తున్నారు. 'ఆశయ' పేరుతో సహాయక బృందాన్ని నెలకొల్పి రావుపల్లి గ్రామంలో తమకు వీలైన మేరకు అభివృద్ధి కార్యక్రమాలు

(మిగతా 8వ పేజీలో...)

నేటి నుంచి
పలు రైళ్ల రద్దు
7లో



ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలకు
అదనపు నోటిఫికేషన్
● ఈనెల 20వరకూ గడువు
● 25న లాటరీ ● 31న అడ్మిషన్ల ఖరారు
7లో

పోక్సో కేసులో నిందితుడికి ఏడాది జైలు
7లో

పక్కాగా అక్షరాంధ్ర: కలెక్టర్

పార్వతీపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్షరాంధ్ర కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. 'జిల్లాలో అక్షరాస్యత 57 శాతంగా ఉంటే... గిరిజన ప్రాంతాల్లో సుమారు 44 శాతం మాత్రమే ఉంది. ఈ ఏడాది 65,011 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి. సాయంత్రం లేదా రాత్రి వేళల్లో నిరక్షరాస్యులకు రోజూ ఒక గంట పాటు అక్షర జ్ఞానం కల్పించాలి. ఫైనాన్షియల్, డిజిటల్ లిటరసీపై అవగాహన కల్పించాలి. స్థానికంగా ఉండి కనీస విద్యార్హత ఉన్నవారిని ట్యూటర్‌గా నియమించుకోవాలి. ముందుగా కేంద్రానికి అనువైన ప్రదేశాన్ని గుర్తించాలి. ప్రతి కేంద్రం వద్ద ఫ్లెక్సీ బోర్డును ఏర్పాటు చేయాలి. ఇందులో డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా, ఐసీడీఎస్ శాఖలు భాగస్వాములవ్వాలి. మండల ప్రత్యేకాధికారులు కేంద్రాలను సందర్శించాల్సి ఉంది. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు పునరావృతం కారాదు. ఇందుకోసం ప్రతి శాఖలో పీజీఆర్ఎస్ కోసం నియమించిన ప్రతినిధి రెండు వారాల పాటు కలెక్టరేట్‌లో శిక్షణ పొందాలి.' అని కలెక్టర్ తెలిపారు. మున్సిపాల్టీలో వీధిలైట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

అనర్హుల గుర్తింపు ఇలాగేనా?

- కళ్లు కనబడకపోతే.. కాళ్లు బాగున్నాయంటూ ధ్రువీకరణ
- నడవలేని స్థితిలో ఉన్నా పింఛను అక్కర్లేదని సిఫారసు
- క్షేత్రస్థాయిలో పొరపాట్లుతో అర్హులకు అన్యాయం
- న్యాయం చేయాలని కలెక్టరేట్‌లో దివ్యాంగుల వినతి

పార్వతీపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పథకం కింద దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారిలో అనర్హుల ఏరివేతకు రంగం సిద్ధమైన విషయం తెలిసిందే. అయితే కొంత మంది వైద్యుల తీరు, క్షేత్రస్థాయిలో జరిగిన పొరపాట్ల కారణంగా అర్హులకు అన్యాయం జరిగింది. కళ్లు కనబడకపోతే కాళ్లు బాగున్నాయని, వీలు కుర్చీలో ఉన్నా.. పింఛన్ అవసరం లేదని ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. దీంతో వారంతా లబోదిబోమంటున్నారు. అన్యాయంగా తమ పింఛన్లు రద్దు చేశారని ఆవేదన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలని సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో వినతిపత్రాలు అందించారు.

అంధులైనా..

- పాలకొండ మండలం బుక్కూరు గ్రామానికి చెందిన సింగర్తి నీరజ అంధురాలు. 2015లో ఇచ్చిన సదరం ధ్రువీకరణ పత్రం ఆధారంగా దివ్యాంగుల పింఛను అందిస్తున్నారు. కాని ఇటీవల సదరం పరిశీలనలో ఆమెకు కాళ్లు బాగానే ఉన్నాయని, పింఛను ఇవ్వక్కర్లేదని వైద్యులు ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. దీంతో ఆమెకు పింఛను రద్దు చేశారు. దీంతో నీరజ తన నాన్నమ్మ చిన్నమ్మడు తోడుతో కలెక్టరేట్‌కు వచ్చి అర్జీ ఇచ్చింది. పింఛన్ పునరుద్ధరించాలని కోరింది.
- అదే మండలం బుక్కూరు గ్రామానికి చెందిన రాగోలు సుదర్శనకు కంటి చూపు పోవడంతో గతంలో దివ్యాంగుల పింఛను మంజూరు చేశారు. కాని ఇటీవల జరిగిన సదరం పరిశీలనలో ఆయనకు కాళ్లు బాగానే ఉన్నాయని ధ్రువీకరించి సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో ఆయన పింఛను రద్దయ్యింది. దీంతో తన భార్య సహకారంతో కలెక్టరేట్‌కు వచ్చి వినతిపత్రం ఇచ్చాడు.



కంటిచూపు లేక ఇబ్బంది పడుతున్న, నీరజ, సుదర్శన

నడవలేకున్నా..

వీరఘట్టం మండలం కడకెల్ల గ్రామానికి చెందిన జి.కోటేశ్వరరావునాయుడు గత ఏడేళ్లుగా నడవలేని స్థితిలో ఉన్నారు. వీల్‌చైర్‌కే పరిమితమైన ఆయనకు దివ్యాంగుల పింఛన్‌ను అందిస్తున్నారు. సదరం ధ్రువీకరణ పత్రాలు పరిశీలన అనంతరం వృద్ధాప్య పింఛన్‌గా మార్చేశారు. ఈ విధంగా ఎంతో మంది కలెక్టరేట్‌లో అర్జీలు అందించారు. దివ్యాంగుల పరిస్థితి చూసి కూడా ఇష్టానుసారంగా సదరం ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం వల్ల అర్హులకు అన్యాయం జరుగుతోందని వారు వాపోయారు. ఇదిలా ఉండగా పింఛన్లు రద్దయిన వారు అప్పీలు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ దివ్యాంగులు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే పత్రాలన్నీ సమర్పించినా.. పింఛను పునరుద్ధరణ అవుతుందో లేదోనని కొందరు ఆందోళన చెందుతున్నారు. దీనిపై డీఆర్‌డీఏ పీడీ సుధారాణిని వివరణ కోరగా.. 'అర్హులైన దివ్యాంగుల పింఛన్ రద్దయితే తగిన ఆధారాలతో పత్రాలు సమర్పించాలి. దీని కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్ కూడా ఏర్పాటు చేశాం.' అని తెలిపారు.



జోరువాన



పొంగి ప్రవహిస్తున్న గెడ్డ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం జోరువాన కురిసింది. చాలాచోట్ల పొలాల్లోకి నీరు చేరింది. కొన్నిచోట్ల గ్రామాల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. వరి నాట్లు వేసిన రైతులకు ఈ వర్షం ఇబ్బంది కలిగించగా.. కొబ్బరి, పనస పంటలకు అనుకూలమని చెబుతున్నారు. వర్షాలతో జలాశయాల్లోకి నీరు చేరింది. దీంతో ఆయకట్టు నీరందుతుందని రైతులు ఆశలు పెట్టుకున్నారు.

- వరి పొలాల్లోకి చేరిన నీరు
- పొర్లి ప్రవహించిన గెడ్డలు

వానొస్తే ఊర్లోనే!

- బయటకెళ్లాలంటే గెడ్డ దాటాలి

జామి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వర్షం వచ్చిందంటే మండలంలోని శాసనపల్లి గ్రామస్థులు ఊరు దాటలేరు. నీటి ఉధృతి తగ్గిన తర్వాతే పాఠశాలకు, సరుకులు తెచ్చుకునేందుకు వెళ్లాలి. ఈ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో పెదవేమలి గ్రామం ఉంది. శాసనపల్లి వాసులు నిత్యవసరాలు కొనుగోలు, చదువులు, ఇతర గ్రామాలకు రాకపోకలు వంటివి పెదవేమలి ద్వారా సాగించాలి. వీరికి వర్షాకాలం వస్తే ఆగ్రామంతో సంబంధాలు తెగిపోతున్నాయి. కారణం వీరు పెదమేమలికి గెడ్డను దాటి వెళ్లాలి. వర్షాకాలంలో ఈ గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో విద్యార్థులు పాఠశాలలకు సెలవులు పెడతారు. గ్రామస్థులు నిత్యవసరాలకు ఇబ్బందులు పడతారు. వీటిపై వీడియో తీసి గ్రామానికి చెందిన కొందరు యువలకు గత ఏడాది అక్టోబరు 5వ తేదీన ఎక్స్‌లో పెట్టారు. మరుసటి రోజు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ స్పందిస్తూ 'నాకు కొంచెం సమయం ఇవ్వండి. మీ సమస్య తీరుస్తా' అని బదులిచ్చారు. తర్వాత రెండు రోజుల్లోనే జిల్లా అధికారులు గ్రామానికి వచ్చారు. గెడ్డపై వంతెన ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు. అయితే దీని నిర్మాణవ్యయం రూ.కోట్లలో ఉండడంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. దీంతో గెడ్డ ఉధృతి తగ్గేవరకు తమకు కష్టాలు తప్పవని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చంపావతి ఉధృతం

గజపతినగరం, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): చంపావతి నది ఉధృతం కావడంతో మర్రివలస మీదుగా వెళ్లే సరాయివలస, సిగడంవలప, రావివలస, యర్రగుడ్ల గ్రామస్థుల రాకపోకలు సోమవారం నిలిచిపోయాయి. అత్యవసర సమయాల్లో 108 వాహనం కూడా రాలేని పరిస్థితి ఏర్పడింది. ప్రతి ఏటా వర్షాకాలంలో ఇక్కడ ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థులు కూడా విద్యాలయాలకు వెళ్లలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు.



సాలూరు రూరల్: దండిగాం వద్ద కాజ్‌వే వద్ద..



ఎయిర్ పోర్టు నుంచి గూడెపువలసలోని మూడు గుళ్ల మీదుగా ప్రవహిస్తున్న వరద నీరు

గ్రామాలను ముంచెత్తిన వరద నీరు

భోగాపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాల్లోకి నీరు చేరింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో 2200 ఎకరాల్లో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మాణం జరుగుతోంది. వైసీపీ హయాంలో చుట్టూ ప్రహరీ కట్టారు. అయితే దానికి ఆనుకుని కాలువలు నిర్మించలేదు. దీంతో ప్రస్తుతం భారీ వర్షాల కారణంగా ఎయిర్‌పోర్టులో పడుతున్న నీరు నాలుగు వైపుల నీరు ప్రవహించి గ్రామాల్లోకి వెళ్తోంది. దీనికితోడు రెడ్డికంచేరులో రోడ్లను కొందరు ఆక్రమించడంతో వర్షపునీరు సమీప గృహాలను ముంచెత్తుతోంది. వర్షపునీరు గూడెపువలస సమీపంలోని మూడు గుడులను ముంచెత్తి చెరువులోకి చేరుతోంది. దల్లిపేట గ్రామంలో పంట పొలాల్లోకి నీరు చేరింది. కవులవాడ, తూడెం, జమ్మయ్యపేట, చినకవులవాడ, బసవపాలెం వైపు వెళ్లే రహదారిపైకి వర్షపునీరు చేరింది.



ప్రవాహంలో ఇరుక్కుపోయిన బైక్‌కు తీస్తున్న దృశ్యం

అండర్‌బ్రిడ్జి మూసివేత



అండర్ బ్రిడ్జిలోకి చేరుతున్న వరద నీరు

కొత్తవలస, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కొత్తవలస జంక్షన్ లోని అండర్ బ్రిడ్జిని రైల్వే శాఖ తాత్కలికంగా మూసేసింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కొత్తవలస జంక్షన్ నుంచి నీరు అండర్ బ్రిడ్జిలోకి చేరడంతో ప్రమాదకరంగా మారింది. దీంతో రైల్వేశాఖ దాన్ని తాత్కలికంగా మూసేసీ ఆర్‌పీఎఫ్ సిబ్బందిని కాపలాగా ఉంచింది. దీంతో పరిసరాల్లో ఉన్న గ్రామాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేశాఖ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని వారు కోరుతున్నారు.

నిలిచిన రాకపోకలు



కోతకు గురైన రహదారి

భోగాపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పెద కొండ్రాజుపాలెం నుంచి చిన కొండ్రాజు పాలెం, కొత్తూరు గ్రామాలకు వెళ్లే రహదారి తెగిపోయింది. పెద కొండ్రాజుపాలెం, చిన కొండ్రాజుపాలెం గ్రామాల మధ్య రహదారి మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో పక్క నుంచి రాకపోకలు సాగించే విధంగా తాత్కాలిక రహదారి ఏర్పాటు చేశారు. వర్షాల కారణంగా ఈ తాత్కాలిక రహదారి కోతకు గురైంది. పెదకొండ్రాజుపాలెం నుంచి చినకొండ్రాజుపాలెంకు, కొత్తూరుకు రహదారి తెగిపోయింది.

సువర్ణముఖికి వరదపోటు

సాలూరు రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కురుకూటి దండిగాం మధ్య సువర్ణముఖి నది సోమవారం ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో కురుకూటి, సంపంగిపాడు, డెన్సరాయి పంచాయతీలకు చెందిన 40 గ్రామాల గిరిజనులకు రాకపోకలకు అవస్థలకు గురయ్యారు. దక్షిణ ఒడిశా కోరాపుట్ జిల్లాలోని ఏవోబీ కొండల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో సువర్ణముఖికి వరద పెరిగింది. దీంతో దండిగాం వద్ద కాజ్‌వేపై నుంచి నీరు ప్రవహించింది.

దేసూరిగెడ్డకు..



గరుగుబిల్లి: రావుపల్లి సమీపంలో పొంగిపొర్లుతున్న దేసూరిగెడ్డ

గరుగుబిల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రావుపల్లి సమీపంలోని దేసూరిగెడ్డ కు సోమవారం వరద ముంచెత్తింది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు గెడ్డవాగు పొంగడంతో సుమారు 400 ఎకరాల వరి పంట ముంపునకు గురైంది. రోజుల తరబడి వరద నీరు నిల్వ ఉండడంతో వరి ఉబాలు చేసిన ప్రాంతంలో మొనలు కుళ్లిపోతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. దేసూరిగెడ్డ పరిధిలో పూడికలు, పిచ్చి మొక్కలు తొలగించకపోవడంతో వరద నీరు బయటకు వెళ్లడానికి వీల్లేకుండాపోయింది.

కూలిన గోడ

గరివిడి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కొండదాడిలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పులి గౌరమ్మ అనే మహిళ నివసిస్తున్న పూరిల్లు గోడ సోమవారం తెల్లవారు జామున కూలిపోయింది. ఆ సమయంలో గౌరమ్మ ఇంటిలో లేకపోవడంతో ప్రమాదం తప్పింది.





వీరఘట్టం: నడుకూరు పాఠశాలలో చేరిన నీరు



మక్కువ: సువర్ణముఖి నది వంతెనపై గోతుల్లో నిలిచిన నీరు

ఊపందుకున్న ఉబాలు

బొబ్బిలి రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వర్షాలు కారణంగా రైతులు దమ్ములు ప్రారంభించారు. పెంట, కొత్తపెంట, అలజంగి, కారాడ, నారాయణప్పవలస, పిరిడి తదితర గ్రామాల్లో రైతులు పనుల్లో బిజీగా మారారు. ఏడీఏ ఎం శ్యామ్‌సుందర్ క్షేత్రస్థాయిలో నారు తీస్తున్న రైతుల వద్దకు వెళ్లి పలు సూచనలు చేశారు. వరి నాట్లు వేసే ముందు నారు చిగుళ్ల తుంచాలని, ఇలాచేస్తే తెగుళ్ల వ్యాప్తి నివారించొచ్చని ఆయన అన్నారు. పురుగు మందుల వాడకం తగించుకోవాలని తెలిపారు.



చిత్రం.. ఓ జ్ఞాపకం



- సాంకేతికత వచ్చినా క్రేజ్ తగ్గని వైనం
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

రాజాం/రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఒక్క క్లిక్‌తో ఎన్నో మనోభావాలను తెలియజేసే అద్భుతమైన శక్తి ఒక్క ఫొటోగ్రఫీకే ఉంది. ప్రతీ క్షణాన్ని మన కళ్లెదుట చెదరని జ్ఞాపకంగా నిలిపి ఉండేది ఫొటో మాత్రమే. కాలగర్భంలో కలిసిపోయిన చరిత్రకు సజీవ సాక్ష్యం చిత్రమే. మాటల్లో చెప్పలేని వంద భావాలు ఒక్క ఫొటోతో పలికించగలమనేది అక్షర సత్యం. మన చిత్రాన్ని అద్దం చూపిస్తే.. ప్రపంచాన్ని ఫొటో చూపిస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికత వచ్చినా ఫొటోకు ఉన్న క్రేజ్ తగ్గలేదు. చిత్రీకరించే సాధనాలు మారాయే తప్ప.. చిత్రం మాత్రం సజీవం అని చెప్పొచ్చు. ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ డాగురే అనే చిత్రకారుడు డాగ్యురోటైప్ అనే ఫొటోను సృష్టించే సాధానాన్ని 1839 ఆగస్టు 19న కనుగొన్నాడు. దాన్ని గుర్తించిన ఫ్రెంచ్ ప్రభుత్వం అప్పటి నుంచి ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుతూ వచ్చింది. 2009లో ప్రపంచ ఫొటోగ్రఫీ ఆర్గనైజేషన్ దీన్ని గుర్తించి అప్పటి నుంచి ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో కొందరు ప్రముఖులు దాచుకున్న అపురూప చిత్రాలు మీకోసం..





ఎమ్మెల్యే బేబీనాయన తీసిన చిత్రాలు

బొబ్బిలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను తన కెమెరాలో బంధించడం బేబీనాయనకు హాబీ. ఆయన తీసిన పలు అరుదైన ఫోటోలు ఇంటర్నేషనల్ మ్యాగజైన్స్‌లో ప్రచురితమయ్యాయి.

- బాంధవగడ్, తడోబా, కన్హా జాతీయ పార్కులలో ప్రతీఏటా వెళ్లి వన్యప్రాణులను ఫొటోలు తీసి తనకు ఎదురైన అనుభవాలను సన్నిహితులతో పంచుకుంటారు.
- జాతీయ స్థాయిలో ప్రఖ్యాతి గాంచిన డబ్ల్యూడబ్ల్యూఎఫ్ (వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్) క్యాలెండరులో ఆయన తీసిన పులుల ఫొటోలు ప్రచురితం అయ్యాయి. మహారాష్ట్రలోని తడోబా, మధ్యప్రదేశ్‌లో భాండవ్‌ఘాడ్ పులుల జాతీయపార్కులో తాను తీసిన మూడు అరుదైన ఫొటోలను ఆ క్యాలెండరులో ప్రచురితం కావడానికి ప్రధాన కారకులు థామస్ విజయన్, ముఖర్జీ అని బేబినాయన ఇప్పటికీ గుర్తు చేసుకుంటూ ఉంటారు.
- స్వతహాగా అమెచ్యూర్ ఫొటోగ్రాఫర్ ఆయన.. తన తండ్రి రాజా ఆర్‌వీజీకే రంగారావు నుంచి మెలకువలను నేర్చుకున్నాన్నారు.
- తన తండ్రితో కలిసి చిన్ననాడు తీసుకున్న అనేక ఫొటోలను చూసుకుని ఇంటిళ్లపాదీ మురిసిపోతుంటామని, ఆల్బమ్‌ను ఓ సారి తిరగేస్తే మనసంతా ఎంతో ఉల్లాసభరితంగా ఉంటుందని అంటారాయన.



- 1982లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరారు కిమిడి వెంకటరావు. నూనూగు మీసాలతో, తెల్లని ఛాయతో నందమూరి తారక రామారావును ఆకర్షించారు. 'ఏం బ్రదర్ చాలా అందంగా ఉన్నావే.. మంచి కళ ఉంది' అన్నారు. అప్పటి నుంచి కిమిడి వెంకటరావు పేరులో కళా తోడయింది. ఆయన 1983 ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ తరఫున ఉణుకూరు నుంచి టిక్కెట్ దక్కించుకున్న సమయంలో నందమూరి తారక రామారావుతో తీసకున్న ఫొటో ఇది.

- గతంలో పెద్ద పెద్ద పట్టణాలకే పరిమితమైన స్టుడియోలు నేడు గ్రామాల్లోనూ దర్శనమిస్తున్నాయి. ఆసక్తితో కొందరు, బతుకుతెరువు కోసం మరికొందరు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ వృత్తికి సంబంధించి స్టుడియోలు, ల్యాబ్‌లు, మిక్సింగ్ యూనిట్లు, లేమినేషన్ సెంటర్లలో జిల్లాలో 30 వేల మంది వరకూ ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.


నైపుణ్యంతోనే గుర్తింపు

ఫొటోగ్రఫీకి ఆదరణ, ప్రాధాన్యం తగ్గలేదు. నైపుణ్యం ఉంటే ఈ వ్యాపారానికి తిరుగులేదు. మారుతున్న పరిస్థితులు, అవసరాలు, టెక్నాలజీని వినియోగించుకుంటే ఫొటోగ్రఫీకి మరో వందేళ్లయినా భవిష్యత్ ఉంది. సెల్‌లో ఫొటో తీసినా ప్రింటింగ్ కోసం స్టుడియోలో అడుగు పెట్టాల్సిందే.

- సుంకరపల్లి సతీష్, ఫొటోగ్రాఫర్, రాజాం



- జస్టిస్ కొత్తపల్లి పున్నయ్య కుమార్తెగా గుర్తింపు పొందారు ప్రతిభాభారతి. నందమూరి తారక రామారావు పిలుపు మేరకు టీడీపీలో చేరారు. 1983, 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో వరుసగా ఐదుసార్లు ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి గెలిచారు. 1983 ఎన్నికల్లో తొలి ఫలితంగా ఎచ్చెర్ల నుంచి ప్రతిభాభారతి గెలవడంతో సెంటిమెంట్‌గా ఆమెను కేబినెట్‌లోకి తీసుకున్నారు ఎన్టీఆర్. తొలి ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతిభాభారతి నందమూరి తారక రామారావుతో తీసుకున్న ఫొటో ఇది.







గ్రామీణ నేపథ్యాన్ని ప్రతిబింబించే ఫొటోలు



పీ4 నియోజకవర్గ కమిటీల జాబితా విడుదల

- చైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే
- సభ్యులుగా ఎంపీడీవోలు, ఏఎస్‌వోలు
- ఇద్దరేసి సోషల్ వర్కర్లకు అవకాశం
- ఉత్తర్వులు వెలువరించిన కలెక్టర్ అంబేడ్కర్

రాజాం రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్(2047) జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కమిటీల జాబితాలు సోమవారం వెలువడ్డాయి. ఈమేరకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తరఫున డిస్ట్రిక్ట్ ఎకనామిక్స్ అండ్ స్టాటస్టికల్ ఆఫీసర్ పి.బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే చైర్మన్‌గా ఉన్న కమిటీలలో కన్వీనర్‌గా నియోజకవర్గ ప్రత్యేకాధికారి వ్యవహరిస్తారు. నియోజకవర్గ పరిధిలోని ఎంపీడీవోలు, ఏఎస్‌వోలు సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు ఇద్దరేసి సంఘ సేవకులను కూడా భాగస్వామ్యులుగా చేర్చారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించి ఇద్దరేసి నియమితులైన సోషల్‌వర్కర్ల జాబితా ఇలా ఉంది. వీరంతా ఆయా నియోజకవర్గాల పరిధిలో నిర్వహించే స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు.

జిల్లాలో ఇలా..

నియోజకవర్గం పేరు	సభ్యుల పేర్లు	హోదా
రాజాం	కొత్తా సాయిప్రశాంత్ కుమార్ దుప్పలపూడి శ్రీనివాసరావు	సోషల్ వర్కర్ సోషల్ వర్కర్
బొబ్బిలి	రౌతు రామ్మూర్తినాయుడు కె.జయబాబు	రిటైర్డ్ ఎంప్లాయీస్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌జీవో, హేండ్ అండ్ హేండ్
గజపతినగరం	ఎ.రామకృష్ణరాజు కె.రవికుమార్	డైరెక్టర్, బాపూజీ రూరల్ ఎన్‌లైటిమెంట్ సొసైటీ ఎండీ, టార్ఫ్ ఫిన్‌టెక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్
చీపురుపల్లి	ఆర్.గోవిందరావు జి.రామినాయుడు	సోషల్‌వర్కర్, గరివిడి ఎన్‌జీవో
ఎస్.కోట	ఎం.సీతారామ పాత్రుడు బి.సన్యాసిరావు	సోషల్‌వర్కర్, కొత్తవలస సోషల్‌వర్కర్, ఎల్.కోట
విజయనగరం	డా.ఎం.జయచంద్రన్‌నాయుడు కాపుగంటి శ్రీనివాస్	డాక్టర్, సోషల్‌వర్కర్ చాంబర్ ఆఫ్ కామర్స్, విజయనగరం
నెల్లిమర్ల	ఆళ్ల వెంకటేశ్వర్రావు బవిరిశెట్టి రామారావు	రిటైర్డ్ టీచర్, సోషల్‌వర్కర్ డాక్టర్, సోషల్‌వర్కర్

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

- జిల్లా వ్యాప్తంగా 150 కేంద్రాల ఏర్పాటు
- రెండు విడతల్లో అప్‌డేషన్ ప్రక్రియ
- జిల్లాలో 16 లక్షల మందికి పెండింగ్

చీపురుపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆధార్ అప్‌డేషన్ పెండింగ్‌లో ఉన్న వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తోంది. ఈ శిబిరాలు మంగళవారం నుంచి జిల్లాలో ప్రారంభం కానున్నాయి. దీని కోసం జిల్లా వ్యాప్తంగా 150 సచివాలయాల్లో అధికారులు ప్రత్యేక కిట్లు ఏర్పాటు చేశారు. మొదటి విడతలో ఈనెల 19 నుంచి 23 వరకూ, రెండో విడతలో 28 నుంచి 30 వరకూ ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేషన్‌ను నిర్వహిస్తారు. ఇప్పటికే ఆధార్ పొందిన వారు తమ జీవిత కాలంలో రెండు సార్లు మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉంది. ఆధార్ పొందిన తొలి 5 నుంచి 15 సంవత్సరాల మధ్యలో ఎంబీయూ-1, పదిహేనేళ్ల తర్వాత ఎంబీయూ-2 చేయించుకోవాలి. అయితే, చాలామందికి ఈ విషయంలో పూర్తి అవగాహన లేకపోవడంతో, పలు సమస్యలు ఎదుర్కోవలసి వస్తోంది. ఆధార్ అప్‌డేషన్ లేక, చాలా ముఖ్యమైన వ్యవహారాలు నిలిచిపోయిన సందర్భాలు కూడా ఎదురవుతున్నాయి.

ఈ సమస్యలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం మేండేటరీ బయోమెట్రిక్ అప్‌డేషన్ ప్రక్రియను రెండు విడతలుగా నిర్వహించాలని నిర్ణయించింది. కాగా, జిల్లాలో దీని కోసం 150 కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను ప్రత్యేక కిట్లను అందజేశారు. వారం రోజుల పాటు జరిగే ఈ ప్రక్రియ ద్వారా పెండింగ్‌లో ఉన్న 16 లక్షల మంది ఎంబీయూ పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ 16 లక్షల్లో సామాన్య ప్రజలు, విద్యార్థులు, చిన్న పిల్లలు ఉన్నారు. కాగా, చీపురుపల్లి డివిజన్ పరిధిలో ఎంబీయూ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు డీఎల్‌డీవో హేమసుందర్ తెలిపారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

- జిల్లాలో కురుస్తున్న వర్షాలు
- నీట మునిగిన పొలాలు
- రహదారులపై నిలిస్తున్న వర్షపునీరు


భోగాపురం: కొండ్రాజుపాలెంలో ముంపులో ఉన్న గృహాలు


ఎస్.కోట రూరల్: పోతనాపల్లి పొలాల్లో నిలిచిన మద్ది గెడ్డ నీరు


వేపాడ: రైల్వే అండర్ బ్రిడ్జి కింద చేరిన వర్షపునీరు

జిల్లాలో గత మూడు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రహదారి గుంతల్లో వర్షపునీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పొలాల్లో చేరిన నీటిని బయటకు పంపించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు నదీ తీర ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలను అప్రమత్తం చేశారు.

భోగాపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డికంచేరు, పెద కొండ్రాజుపాలెం గ్రామాల్లో పలు గృహాలు ముంపునకు గురయ్యాయి. అక్కివరం


ఎస్.కోట: విశాఖ-అరకు రోడ్డులో నిలిచిన నీరు

సమీప జాతీయ రహదారిలో ఉన్న అండర్‌పాస్ నీటితో నిండింది. చేపలకంచేరు నుంచి ముక్కాం వెళ్లే రహదారి పూర్తిగా గోతులమయం కావడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు.

● ఎస్.కోట రూరల్: గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పొలాల్లో చేరిన నీటిని మళ్లించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.

● రేగిడి: వర్షాలకు మడ్డువలస, తోటపల్లి ప్రాజెక్టులు నిండిపోవడంతో నాగావళి నదికి వరద పోటు కనిపిస్తోంది. తహసీల్దార్ కృష్ణలత సోమవారం నదీ తీర గ్రామాల్లో పర్యటించారు. లోతట్టు వాసులను అప్రమత్తం చేశారు. మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

● శృంగవరపుకోట: పట్టణ పరిధిలోని పలు కాలనీ రోడ్లలో నీరు ప్రవహిస్తోంది. ఎస్.కోట రాచ్చేరువును గట్టును తహసీల్దార్ డి.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు.

నీటితో నిండి రైల్వే అండర్ బ్రిడ్జి

వేపాడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సోంపురం రైల్వే అండర్ బ్రిడ్జి నీటితో నిండిపోయింది. దీంతో ఈ రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. అండర్ బ్రిడ్జి కింద సుమారు 8 అడుగులు నీరు చేరింది. దీంతో ఓ ట్రాక్టర్ నీటిలో నిలిచిపోయింది. క్రేన్ సాయంతో బయటకు తీయాల్సి వచ్చింది.

మారిక రోడ్డుకు పగుళ్లు

వేపాడ ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మారిక గ్రామ రోడ్డుకు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పగుళ్లు ఏర్పడ్డాయి. నిర్మించిన కొద్ది నెలలకే ఇలా కొట్టుకు పోవడంపై ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు

గంట్యాడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవరం, వసంత గెడ్డలు పొంగి ప్రవహించడంతో పరిసర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వసంత గెడ్డ ప్రవహిస్తున్న రహదారిపై రాకపోకలు నిలిపివేస్తున్నట్లు గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తాటిపూడి రిజర్వాయిర్ నీటి మట్టం 290.99 అడుగులకు చేరింది.

ప్రభుత్వ భవనాల్లో వర్షపు నీరు

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జోరువాన కురవడంతో కలెక్టరేట్‌లోని పలు భవనాలు కారిపోవడం కనిపించింది. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలోకి వర్షం నీరు రావడంతో సిబ్బంది ప్లాస్టిక్ బకెట్లు పెట్టుకోవల్సి వచ్చింది. కార్యాలయం బయిట కూడా అదే పరిస్థితి కనిపించింది. కలెక్టరేట్ ఆవరణలో అడుగు మేర నీరు నిలిచింది.


కలెక్టరేట్: మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో వర్షపునీటికి బకెట్లు పెట్టిన దృశ్యం

అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు అధికారుల సూచన
- లోతట్టు ప్రాంతాల్లో పర్యటన
- వివిధ శాఖల సిబ్బందితో సమీక్ష

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన సోమవారం పర్యటించారు. రహదారులపై నీటి ప్రవాహనికి అడ్డంకులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ట్యాంకు బండ్


రేగిడి: వెంకమ్మపేట వద్ద అకులోవగెడ్డను పరిశీలిస్తున్న ఆర్డీవో ఆశయ్య

రోడ్డు వద్ద పెద్దచెరువు అవుట్‌ఫ్లో ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ ప్రధాన కాలువలోకి గుర్రపు డెక్క అధికంగా వచ్చి చేరడంతో వాటిని జేసీబీల సహాయంతో తొలగింపజేశారు. వర్షాల వల్ల సమస్యలు తలెత్తితే, నగరపాలక సంస్థ హెల్ప్‌లైన్ నెంబరు 9849906486 ఫోన్ చేసి సహాయం పొందవచ్చునని తెలిపారు. ● రేగిడి: నాగావళి నది తీర లోతట్టు ప్రాంత వాసులను అప్రమత్తం చేయాలని చీపురపల్లి ఆర్డీవో ఆశయ్య సిబ్బందికి సూచించారు. వెంకమ్మపేట- చెలిగానవలస మధ్య ఆకులో వగెడ్డ, కందిశ, తునివాడ నాగావళి లోతట్టు గ్రామాలను ఆయన సోమవారం పరిశీలించారు. వెంకమ్మపేట ఆకులోవ గెడ్డ వంతెన ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని తహసీల్దార్ కృష్ణలతను ఆదేశించారు. ఆర్ఐ కిరణ్ ఉన్నారు. ● గజపతినగరం: చంపావతి నది, ఏడొంపులగెడ్డ నదీ పరివాహక ప్రాంతాల్లో గల లోతట్టు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి ఎం.రమేష్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. నదీ తీర ప్రాంతాల్లో ప్రవాహలను అంచనా వేసి ముందస్తు జాగ్రత్తగా అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కె.పుష్పలత, ఇన్‌చార్జి తహసీల్దార్ శోభ పాల్గొన్నారు. ● వంగర: మడ్డువలస రిజర్వాయర్, నాగావళి నది పరిసర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజశేఖర్ సూచించారు. సోమవారం ఆయన కొప్పర, కొండచాకరాపల్లి, కొత్తవలసలలో పర్యటించి, ప్రజలను అప్రమత్తం చేశారు. ● సంతకవిటి: అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని డ్వామా పీడీ, మండల ప్రత్యేక అధికారిణి ఎస్.శారదాదేవి ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల సిబ్బందితో ఆమె సోమవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం కృష్ణంవలస సమీపంలో పాత చెరువుకు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ● వేపాడ: మండలంలో ముంపునకు గురైన వరి


విజయనగరం రింగురోడ్డు: కాలువలను పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

పొలాలను మండల ప్రత్యేకాధికారి చిన్న రెడ్డయ్య, తహసీల్దార్ జె.రాములమ్మ సోమవారం పరిశీలించారు. కుమ్మపల్లిలో రెండు పూరిల్లు కూలిపోయినట్టు తహసీల్దార్ తెలిపారు. ● దత్తిరాజేరు: దత్తి గ్రామంలో ప్రత్యేకాధికారి విమలారాణి సోమవారం పర్యటించారు. ప్రజలకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో శివాజీ, ఇతర అధికారులు ఉన్నారు. ● మెరకముడిదాం: ఉత్తరావల్లి పంచాయతీ పరిధిలో ఉన్న సదాశివుని చెరువును డీపీవో మల్లికార్జునరావు, ఎంపీడీవో జి.భాస్కరరావుతో కలిసి సోమవారం పరిశీలించారు. మండల పంచాయతీ విస్తరణాధికారి శ్రీరాములునాయుడు ఉన్నారు.

పెండింగ్ ఈ-చలానాలు చెల్లించాలి

విజయనగరం క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మోటారు వాహనాల చట్టాల ఉల్లంఘనకు పాల్పడిన వాహనాలపై చలానాలు విధించామని, పెండింగ్‌లో ఉన్న ఈ-చలానాలను తక్షణమే చెల్లించాలని రవాణా శాఖ ఉపకమిషనర్ మణికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల్లో ఈ-చలానాలు చెల్లించకపోతే వాహనాలు సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. చెల్లించే ప్రక్రియలో ఎటువంటి సమస్యలు ఎదురైతే, రవాణాశాఖ కార్యాలయంలోని పరిపాలన అధికారిని సంప్రదించాలన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు అదనపు నోటిఫికేషన్

విజయనగరం రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేద, బలహీన వర్గాల పిల్లల కోసం కేటాయించింది. ఈ మేరకు తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 20వరకూ గడువు ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 25న లాటరీ నిర్వహిస్తారని, 31న అడ్మిషన్లు ఖరారు చేస్తారని తెలిపారు.

20లోగా ఫిర్యాదులు పంపవచ్చు

నెల్లిమర్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అన్నదాతా సుఖీభవ పథకం ఫిర్యాదుల మాడ్యూల్ ఈనెల 20న ముగుస్తుందని ఏవో పి.శ్రీలక్ష్మి తెలిపారు. నెల్లిమర్లలో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈకేవైసీ సమస్య కారణంగా తిరస్కరించబడిన అర్హత ఉన్న రైతులు ఆధార్, వన్‌బీ, బ్యాంకు అకౌంట్, ఫోన్ నెంబర్, రేషన్ కార్డుతో గడువుకి ముందే రైతు సేవా కేంద్రంలో గ్రీవెన్స్ మాడ్యూల్ ద్వారా ఫిర్యాదులను సమర్పించాలన్నారు.

తాత్కాలికంగా కాలువ ఏర్పాటు


కాలువను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కొత్తవలస, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొత్తవలస మూడు రోడ్ల కూడలి జలమయమైంది. దీంతో జంక్షన్‌లో ఉన్న వివిధ షాపులు నీటిలో మునిగిపోయాయి. టీడీపీ మండల అధ్యక్షుడు గొరపల్లి రాము చొరవ తీసుకుని, పంచాయతీ అధికారులతో కలిసి తాత్కాలికంగా కాలువను ఏర్పాటు చేసి, వరద నీటిని డాబాలు గెడ్డకు మళ్లించారు.

నేటి నుంచి పలు రైళ్ల రద్దు

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం డివిజన్ పరిధిలోని పార్వతీపురం-డొంకినవలస నడుమ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం నుంచి ఈ నెల 28 వరకు పలు రైళ్లను రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కొన్ని రైళ్ల గమ్యాలను కుదించామని, మరికొన్నింటిని రీ షెడ్యూల్ చేశామని పేర్కొన్నారు.

రద్దయిన రైళ్లు..

ఈనెల 19 నుంచి 27 వరకు విశాఖ-రాయ్‌పూర్ పాసింజర్ (58528), విశాఖ-కోరాపుట్ పాసింజర్ (58538), విశాఖ-భవానీపట్న పాసింజర్ (58504). ఈనెల 20 నుంచి 28 వరకు రాయ్‌పూర్-విశాఖ పాసింజర్ (58527), కోరాపుట్-విశాఖ పాసింజర్ (58537), భవానీపట్న-విశాఖ పాసింజర్ (58503).

రీ షెడ్యూల్..

ఈ నెల 22 నుంచి 27 వరకు విశాఖ-దుర్గ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20830) నిర్ణీత సమయం కంటే రెండున్నర గంటలు ఆలస్యంగా, తిరుగు ప్రయాణంలో దుర్గ్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20829) మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరతాయి. అలాగే విశాఖలో ఉదయం 9.20 గంటలకు బయలుదేరాల్సిన విశాఖ-నిజాముద్దీన్ సమతా ఎక్స్‌ప్రెస్ (12807) ఈ నెల 20, 21, 23, 24, 26 తేదీల్లో మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరేలా (ఐదు గంటలు ఆలస్యంగా) రీ షెడ్యూల్ చేశారు.

గమ్యం కుదింపు..

గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్(17243) ఈనెల19 నుంచి 26 వరకు గుంటూరు-విజయనగరం మధ్య, తిరుగు ప్రయాణంలో రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్(17244) ఈనెల 20 నుంచి 27 వరకు విజయనగరం-గుంటూరు మధ్య రాకపోకలు సాగిస్తాయి. విజయనగరం-రాయగడ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలి

● ఎస్పీ వకుల్ జిందాల్


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

విజయనగరం క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులకు న్యాయం చేసేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించి, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పోలీసు అధికారులతో వీసీలో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. చట్ట పరిధిలో చర్యలు చేపట్టి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆయన ఆదేశించారు. ఈసందర్భంగా 27 ఫిర్యాదులను స్వీకరించారు. ఆయా ఫిర్యాదుల్లో భూ తగాదాలకు సంబంధించినవి-7, కుటుంబ కలహాలు-5, మోసాలకు పాల్పడినట్టు-4, ఇతర అంశాలకు సంబంధించినవి-11 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ పి.సౌమ్యలత, ఎస్‌బీ సీఐ ఏవీ లీలారావు, డీసీఆర్‌బీ సీఐ బి.సుధాకర్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ బ్యాంకును బాధ్యతగా నడపాలి

బొండపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాచకిండాం పీఏసీఎస్ బ్యాంకును త్రిసభ్య కమిటీ సభ్యులు బాధ్యతగా నడపాలని ఏఎంసీ అధ్యక్షుడు పీవీవీ గోపాలరాజు అన్నారు. సోమవారం ఆయన గంట్యాడ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావుతో కలిసి సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. కనిమెరక మాజీ ఎంపీటీసీ గొర్లె సత్యవతితోపాటు డైరెక్టర్లుగా రాచకిండాం, దేవుపల్లి గ్రామాలకు చెందిన బండారు చినసూరినాయుడు, కొవ్వూరు అచ్యుతరావులతో కార్యదర్శి మద్రాపై లీలాప్రసాద్ ప్రమాణస్వీకారం చేయించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాపాక అచ్చంనాయుడు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు కోరాడ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని 45, 55వ నెంబరు డివిజన్‌లో సచివాలయాలను నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు సోమవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. హాజరు పట్టీలు పరిశీలించారు. మెరుగైన పౌరసేవలు అందించాలన్నారు. ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే దిశగా చూడాలని ఆయన సూచించారు.

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 94 వినతులు


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించి పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై 94 వినతులు వచ్చాయి. వీటిని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్, డీఆర్వో శ్రీనివాస్‌మూర్తి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు వెంటనే పరిష్కరించాలని సూచించారు. వచ్చిన 94 వినతుల్లో భూ సమస్యలకు సంబంధించి 32, డీఆర్‌డీఏ 12, మున్సిపాల్టికి 3, విద్యా శాఖకు 6, జిల్లా పంచాయతీకి 5, విద్యుత్ శాఖకు 3, గ్రామ వార్డు సచివాలయం 11, వైద్య ఆరోగ్య శాఖకు 3, ఇతర శాఖలకు 19 అర్జీలను ప్రజలు అందజేశారు.

ఐక్యతను దెబ్బ తీసేందుకే ఎస్సీ వర్గీకరణ

చీపురుపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఉన్న దళితుల ఐక్యతను దెబ్బ తీయడానికే ఎస్సీ వర్గీకరణ పేరుతో కుట్ర పన్నారని రాక్స్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డా.రత్నాకర్ ఆరోపించారు. చీపురుపల్లిలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గంపై కత్తి కట్టాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో రేగిడి రామకృష్ణ, అడ్డూరి కృష్ణ, బవిరి రవిశంకర్, దీనుపల్లి రాము, సూరిబాబు, ఎత్తుల ఈశ్వర్ పాల్గొన్నారు.

డీబీఎస్‌యూ మహాసభలను జయప్రదం చేయాలి

విజయనగరం టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 26వ తేదీన జరిగే డీసీఎంఎస్‌యూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు కోరారు. సోమవారం స్థానిక డీబీఎస్‌యూ కార్యాలయంలో మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ వద్ద గల జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి యూత్ హాస్టల్‌లో మహాసభలను నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రతినిధులు మొండూరి రాజు, యు.రాము, జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ కోరుకొండ వరలక్ష్మి, కళ్యాణి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆ కోనేరులోకి చేపలు ఎలా వచ్చాయి?

ఎస్.కోట రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ధర్మవరం సమీపంలోని సన్యాసయ్యపాలెంలో గల సన్యాసేశ్వరస్వామి ఆలయ పుష్కరిణిలోకి చేపలు ఎలా వచ్చాయన్న అంశంపై కొద్ది రోజులుగా చర్చ సాగుతోంది. కొద్ది రోజులుగా ఈ కోనేరులో ఉన్న చేపలు మృత్యువాత పడటం.. వీటి నుంచి దుర్వాసన రావడంతో పలువురు భక్తులు ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఈవిషయంపై ఆలయ తాత్కాలిక ఈవో ప్రసాద్‌ను వివరణ కోరగా మూడు రోజులుగా చేపలు చనిపోతున్నాయని తెలిపారు. అయితే ఈ పుష్కరిణిని ఎవరికైనా చేపల పెంపకం కోసం లీజుకు ఇచ్చారా అనే విషయం తెలియాల్సి ఉంది. ఎవరైనా దీనిలో విష ప్రయోగం చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తోటపల్లి రాజాం కాలువ పరిశీలన

రేగిడి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తోటపల్లి రాజాం బ్రాంచ్ (21ఎల్) కాలువ పనులను రాజాం ఏఎంసీ బృందం సోమవారం పరిశీలించింది. ఏఎంసీ ఛైర్మన్ గురవాన నారాయణరావు, పలువురు డైరక్టర్లతో కలిసి ఈ కాలువ టైలాండ్ వరకు జరిగిన పనులను పరిశీలించారు. ఇంకా కిలోమీటరు మేర పనులు చేయాల్సి ఉందన్నారు. ఈ కాలువతో దాదాపు ఆరు గ్రామాల్లో వెయ్యి ఎకరాలకు పుష్కలంగా నీరు అందుతుందని తెలిపారు. ఈ పరిశీలనలో డైరెక్టర్లు గురవాన ధనంజయ్‌రావు, బోని నారాయణరావు, బూరాడ గ్రామ ప్రతినిధి గణేష్ ఉన్నారు.

కూలిన రక్షణ గోడ



కొత్తవలస, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వీరభద్రపురం పంచాయతీ వెదుళ్ల పైడితల్లమ్మ ఆలయానికి వెళ్లే సిమెంట్ రోడ్డుకు సంబంధించి దొంగల గెడ్డ పక్కన నిర్మిస్తున్న రక్షణ గోడ సోమవారం కూలిపోయింది. సుమారు రూ.2లక్షలు నష్టం వాటిల్లి ఉండవచ్చునని రెవెన్యూ శాఖ అంచనా వేసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అప్పారావు (ఫైల్)

రామభద్రపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిష్టు సీతారాంపురం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. కొద్దిక్షణాల్లో స్వగ్రామానికి చేరుకుంటాడన్న సమయంలో మృత్యువు కబలించింది. పోలీసుల కథనం మేరకు.. శిష్టు సీతారాంపురం గ్రామానికి చెందిన వెన్నెల అప్పారావు ఉరఫ్ మధు(32) బైకుపై రామభద్రపురం నుంచి శిష్టు సీతారాంపురం వెళ్తున్నాడు. ఓ మలుపు వద్ద విద్యుత్ స్తంభానికి ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. అప్పారావుకు గత నెల ఐదో తేదీన ప్రశాంతికుమారితో వివాహమైంది. పెళ్లి అయి 50 రోజులు కాకముందే అప్పారావు మృతితో భార్య రోదిస్తోంది. ఆయన కూలి పనులు చేసి జీవనం సాగిస్తున్నాడు. తండ్రి మృతిచెందడంతో తల్లి, భార్యకు అప్పారావు ఒక్కడే ఆధారం. భర్త మృతిచెందడంతో కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోయామని భార్య విలపిస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించి ఎస్ఐ వి.ప్రసాదరావు కేసు నమోదు చేశారు.

చెరువులో పడి వ్యక్తి..

గంట్యాడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పెదవేమలి గ్రామానికి చెందిన బోదంకి ఎర్నినాయుడు(50) అనే వ్యక్తి సోమవారం మధ్యాహ్నం చెరువులో పడి మృతిచెందాడు. ఎస్ఐ సాయికృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్నినాయుడు తన పశువులను వీరసాగరం చెరువు వైపు మేతకు తీసుకుని వెళ్లాడు. పశువులు మేత మేస్తుండగా ఎర్నినాయుడు బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయి మృతిచెందాడు. స్థానికులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి ఏడాది జైలు

విజయనగరం క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తపేటకు చెందిన దశమంతుల లక్ష్మణరావుకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి సోమవారం తీర్పు వెల్లడించినట్టు మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు. కొత్తపేటకు చెందిన లక్ష్మణరావు 2023లో ఓ బాలిక వెంట పడుతూ.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసినట్టు జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో అప్పట్లో కేసు నమోదయ్యింది. లక్ష్మణరావుపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి కె.నాగమణి పై విధంగా తీర్పు వెల్లడించారని డీఎస్పీ తెలిపారు.

పిచ్చికుక్క స్వైర విహారం

సంతకవిటి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మోదుగులపేట గ్రామంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. నలుగురుపై దాడి చేసి, గాయ పరిచింది. ఇందులో తాడివలస శివశంకర్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. వీరంతా స్థానిక ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందారు. బాలుడికి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. గ్రామ యువత ఆ పిచ్చి కుక్కను గ్రామ పొలిమేరకు తరిమేశారు.

గుర్లలో వైరల్ జ్వరాలు లేవు

గుర్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గుర్ల గ్రామంలో ఎటువంటి వైరల్ జ్వరాలు లేవని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి సోమవారం ప్రకటనలో తెలిపారు. గుర్లలో 50 మందికి చికెన్‌గున్యా జ్వరాలు ఉన్నాయంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆమె స్పష్టం చేశారు.

అధికారుల పరిశీలన

గుర్ల గ్రామంలో డీపీవో మల్లిఖార్జున, డీఎంహెచ్‌వో జీవనరాణి, జిల్లా మలేరియా అధికారి మణి, ఎంపీడీవో రవికుమార్, ఈవోపీఆర్డీ అన్నపూర్ణదేవి, డాక్టర్ సత్యనారాయణలు సోమవారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి జ్వర పీడితులు ఎవరైనా ఉన్నారా.. అని ఆరా తీశారు. ● పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, మందులు పంపిణీ చేశారు. హోమియా వైద్యాధికారి వెంకట మధు, నేచురోపతి వైద్యాధికారిణి రజితారోయ్ పాల్గొన్నారు.

బీసీలకు 50శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలో సమగ్ర కుల జనగణన చేసి, బీసీలకు 63.1 శాతం ఉండాలని ప్రకటించిందని తెలిపారు. అలాగే మన రాష్ట్రంలోని బీసీలకు 50శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సంఘ నాయకులు సోములు, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులు 20న హాజరుకావాలి

విజయనగరం క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విజయనగరం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రక్రియకు హాజరై.. సివిల్, ఏపీఎస్‌పీ ఉద్యోగులకు ఎంపికైన మహిళా, పురుష అభ్యర్థులు ఈనెల 20న జిల్లా పోలీసు కార్యాలయంలో ఉదయం 8 గంటలకు హాజరు కావాలని ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అభ్యర్థులు సెలక్షన్ ప్రక్రియలో అప్లికేషన్‌తో జతపరిచిన ధృవపత్రాల ఒరిజినల్ సర్టిఫికెట్లను అటెస్టేషన్ చేయించి మూడు సెట్ల జిరాక్స్ కాపీలను, మూడు పాస్‌పోర్టు సైజు కలర్ ఫోటోలను తీసుకుని రావాలన్నారు. జిల్లాలో నిర్వహించిన సెలక్షన్ ప్రక్రియకు హాజరైన అభ్యర్థుల్లో 723 మంది అభ్యర్థులు వివిధ జిల్లాల్లో సివిల్, ఏపీఎస్‌పీ బెటాలియన్స్, ఎస్‌సీటీ, పోలీసు కానిస్టేబుల్స్‌గా ఎంపికయ్యారని తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయండి


పోలీసులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): జిందాల్ యాజమాన్యానికి అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్.కోట తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చారు. జిందాల్‌కు ప్రభుత్వం ఇచ్చిన జీవోలు రద్దుచేయాలని కోరుతూ బ్యానర్ పట్టుకుని నిరసన చేశారు. బ్యానర్ పట్టుకోవడంపై పోలీసులు అభ్యంతరం తెలిపారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఇంతలో అక్కడకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వచ్చారు. బ్యానర్ పట్టుకోవద్దని ప్రభుత్వం జీవో ఏమైనా ఇచ్చిందా.. అని ఆయన పోలీస్‌లను ప్రశ్నించారు. నిర్వాసితులు బ్యానర్‌తోనే నిరసన కొనసాగించారు. అనంతరం తహసీల్దార్ డి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు.

అర్జీలను పరిష్కరించండి

● కలెక్టర్ శ్యాం ప్రసాద్ అధికారులకు ఆదేశం



పార్వతీపురం: అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

పార్వతీపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలన్నీ పరిష్కరించాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశించారు. సోమవారం పార్వతీపురంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన పీజీఆర్ఎస్ నిర్వహించారు.ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి, రెవెన్యూడివిజనల్ అధికారి కె.హేమ లత, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మాచం ద్రారెడ్డి వినతులు స్వీకరించారు. అలాగే బతికుండగానే చంపేశారని, తనకు న్యాయం చేయాలని పార్వతీపురానికి చెందిన వావిలపల్లి శంకరరావు డీఆర్‌డీఏ పీడీ సుధారాణికి వినతిపత్రం అందించాడు.ఆధార్‌కార్డు రద్దు చేయడం, రేషన్‌కార్డులో పేరు లేకపోవడంతో అన్నదాత సుఖీభవ పథకం అందలేదని వాపోయాడు.అర్హత ఉన్న అన్నదా త సుఖీభవ పథకం మంజూరు కాలేదని పలువురు విన్నవించారు.

●సీతంపేట రూరల్,ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో ఏపీవో జి.చిన్నబాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు సమస్యలు పరిష్కరించాలని పది వినతులు అందాయి. కార్య క్రమంలో డీడీ అన్నదొర, పీహెచ్‌వో ఆర్‌వి గణేష్, డిప్యూటీ ఈవో జి.రామ్మోహనరావు, ఏవో వై.వాహిణి పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

●పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



పార్వతీపురంటౌన్: గణేష్ నగర్ కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ప్రత్యేక దృష్టి సారించినట్లు పార్వతీపురంఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర తెలిపారు. సోమవారం పార్వతీపురంలోని సౌందర్య థియేటర్‌వీధి, గణేష్‌నగర్ తదితర లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు.ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఏటా పట్టణంలోని వరహాలగెడ్డ పరివాహకంలోగల కాలనీలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ప్రధాన రహదారిలో వరద నీరు నిల్వ ఉండకుండా కాలువల్లో పూడికలు తీయించేందుకు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నామన్నారు. కాగా పార్వతీపురంలోని బైపాస్, రాయగడ రోడ్డు, పాతబస్టాండ్ రహదారులను ఎమ్మెల్యే విజయచంద్ర, ఆర్ అండ్‌బీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ రహదారుల్లో భారీ గుంతలు ఏర్పడడంతో వాహనాలు నిలిచిపోవడం వల్ల ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు.

●పార్వతీపురం రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతోపాటు పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. వెంకంపేట పంచాయతీలో టీడీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభించారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి

● పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జయకృష్ణ

పాలకొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచించారు. సోమవారం మండలంలోని చిన్నమంగళాపురం గ్రామ సచివాలయాన్ని తనిఖీచేసి, రికార్డులు పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు జాడ శ్రీధర్, వైస్ ఎంపీపీ వి.అనీల్‌కుమార్, సుధాకర్ పాల్గొన్నారు. అలాగే అవలంగికి చెందిన టీడీపీ నాయకుడు ముంజేటి గోవిందనాయుడు కుమారుడు రమేష్ మరణించడంతో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పరామరించారు. అలాగే చిన్న మంగళాపురానికి చెందిన కిమిడి కాశింనాయుడు సోదరుడు సూరపునాయుడు మృతిచెందడంతో, బెజ్జిలో వావిలపల్లి శంకరరావు మృతిచెం దడంతో ఆయా కుటుంబాలను పరామర్శించారు.

పి.ఆమిటి రోడ్డు పునర్నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పి.ఆమిటి బీటీ రహదారి పునర్నిర్మాణానికి ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి సోమవారం శంకుస్థాపన చేశారు. పార్వతీపురం ప్రధాన రహదారి నుంచి పి.ఆమిటి వరకు రూ.1.20 కోట్లతో 2.5 కిలోమీటర్లు వరకు బీటీ రోడ్డు నిర్మించనున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కడ్రక కళావతి, ట్రైకార్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ పువ్వల లావణ్య, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గార గౌరీశంకరరావు పాల్గొన్నారు.

కష్టపడితే విజయం తథ్యం: సీఐ



మాట్లాడుతున్న మురళీధర్

పార్వతీపురంటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఇష్టపడి కష్టపడితే విజయం తథ్యమని పట్టణ సీఐ మురళీధర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆర్‌కే కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డే కరస్పాండెంట్ పి.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థిదశ ప్రతిఒక్కరికి కీలకమన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలను సాధించడమే కాకుండా మీ భవిష్యత్ తరాల వారికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. అనంతరం కళాశాల యాజమాన్య ప్రతినిధులు సీఐను సన్మానించారు.

చంద్రపూర్ సమితిలో గ్రీవెన్స్

రాయగడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చంద్రపూర్ సమితిలో రాయగడ జిల్లా యంత్రాంగం సోమవారం సంయుక్త పిర్యాదుల విచారణ కార్యక్రమం నిర్వహించింది. కలెక్టర్ అశుతోష్ కులకర్ణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 39 మంది అర్జీదారులు తమ సమస్యలను వివరించారు. ఇందులో 21 మంది వ్యక్తిగత, 18 మంది గ్రామాల్లో పలు సమస్యలను వివరించారు. అనంతరం కలెక్టర్ ఐదుగురికి రెడ్‌క్రాస్ నిధుల నుంచి రూ.,51 వేల అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్‌కుమార్, జిల్లా కేంద్రాసుపత్రి ముఖ్య వైద్యాధికారి వి.సరోజాదేవి, చంద్రపూర్ సమితి అధ్యక్షుడు కొయిన్‌కిమ్మక, చంద్రకాంత్ బంగ్గా పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు పూర్తిచేయాలి

రాయగడ,ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాలు వెంటనే పూర్తిచేయాలని పంచాయతీ రాజ్, నీటిపారుదల శాఖ కమిషనర్, కార్యదర్శి గిరీష్ ఆదేశించారు. సోమవారం గుణుపూర్ సబ్‌డివిజన్‌లో పర్యటించారు. తొలుత ప్రభుత్వాసుపత్రిని సందర్శించి రోగులతో మాట్లాడారు. అనంతరం వైద్యులతో ఆసుప త్రికి సంబంధించిన వివిధ సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.చినసారి, కులుసింగి తదితర గ్రామాలను సందర్శించి బిక్షిత్ ఒడిశా ద్వారా అక్కడ నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో చర్చించారు. పుటాసింగ్ ఉన్నత పాఠశాలకు బోధన , మధ్యాహ్న భోజన పథకం గురించి అడిగితెలుసుకున్నారు.

ఏజెన్సీలో విజృంభిస్తున్న విషజ్వరాలు

● సీతంపేట ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి



ఏరియాఆసుపత్రిలో ఓపి నమోదు కోసం బారులుతీరిన రోగులు, సహాయకులు

సీతంపేట రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తుండడం, పారిశుధ్య నిర్వహణ గాడి తప్పడం తదితర కారణాల వల్ల గ్రామాల్లో జ్వరపీడితులు సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. జ్వరం, తలనొప్పి, కీళ్లనొప్పులు, వాపులు వంటి లక్షణాలతో గిరిజనులు అవస్థలకు గురవుతున్నారు.ఈ నేపథ్యంలో సోమవారం సీతంపేట ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి పెరిగింది. ఒక్కరోజూ ఓపీ 365 వరకు రాగా వీటిలో 71 మంది వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు.మరో 34మంది ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్నారు. కాగా ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగుల కోసం ప్రస్తుతం వినియోగంలో ఉన్న 80 బెడ్లతో పాటు అదనంగా మరో పది బెడ్లు సిద్ధం చేసినట్లు సూపరింటెండెంట్ బి శ్రీనివాసరావు చెప్పారు.

దేసూరిగెడ్డ ముప్పు నుంచి తప్పించండి

గరుగుబిల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):రావుపల్లి సమీపంలోని దేసూరిగెడ్డ ముప్పు నుంచి తప్పించి రైతులను ఆదుకోవాలని సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు, చింతల మోహనకృష్ణ, బి.సుదర్శనరావు, ఎ.భార్గవరావు, పి.తేజేశ్వరరావు, ఎం.త్రినాధస్వామి, చింతల వైకుంఠరావుతో పాటు పలువురు రైతులు కోరారు.ఈ మేరకుసోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. గెడ్డ ప్రాంతాన్ని సర్వే నిర్వహించి వెడల్పుతో పాటు హద్దులు నిర్ణయించాలని కోరారు. దేసూరిగెడ్డ పరిధిలో రావుపల్లి, కొత్తపల్లి, బలిజిపేట మండలం లోని చాకరాపల్లితో పాటు పలు గ్రామాల ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్‌కు వివరించారు. డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావుకు సమస్య పరిష్కరించాలని కలెకర్ ఆదేశించారని తెలిపారు.

వర్క్‌ఫ్రం హోం సర్వే వేగవంతం చేయాలి

మక్కువ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వర్క్ ఫ్రం హోం సర్వే వేగవంతం చేయాలని పంచాయతీ కార్యనిర్వహణాధికారి బెహరా శ్రీనివాసరావు కోరారు. సోమవారం . స్థానిక సచివాలయంలో సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రా ష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి జగన్మోహనరావు



సీతానగరం:బూర్జ గ్రామస్థులతో మాట్లాడుతున్న జగన్మోహనరావు

సీతానగరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. సోమవారం బూర్జలో వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. సీజనల్ వ్యాధులు, జ్వరాలు నమోదు, వైద్య సేవలపై గ్రామస్థులను, తాగునీటి నాణ్యత పరీక్షల నివేదికలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దోమల లార్వా ప్రదేశాలను గుర్తించి ఎప్పటికప్పుడు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

వ్యాధి నిరోధక టీకాలపై స్పెషల్ డ్రైవ్

గరుగుబిల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):పంచాయతీల్లో వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు ఈనెల 23వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్ ఎంకే తిరుమలప్రసాద్ తెలిపారు.గరుగుబిల్లిలో విలేకరులతో మాట్లాడుతూ జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని అనుసరించి ఇంతవరకు వ్యాక్సిన్ వేయించని పిల్లలకు విధిగా వ్యాధి నిరోదక టీకాలు వేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు.

కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి

మునిసిపాలిటీలో ఆప్కాస్ విధానంలో పారిశుద్య కార్మికులుగా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాల్లో ఉన్న ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద మృతి చెందిన కుటుంబాలకు న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో- 25 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఆప్కాస్‌లో పనిచేస్తూ మృతి చెందిన కార్మిక కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చారని తెలిపారు. పార్వతీపురం మునిసిపాలిటీలో పనిచేస్తూ మృతి చెందిన వారి కుటుంబాలకు కూడా ఉద్యోగం ఇవ్వాలని కోరారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఖైదీల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



రికార్డులను పరిశీలిస్తున్న హరిబాబు

పాలకొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సబ్‌జైలులోని ఖైదీల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు సిబ్బందికి ఆదేశించారు. సోమవారం పాలకొండలోని సబ్‌జైలును సందర్శించారు. ఈసందర్భంగా జైలులో ముద్దాయిలతో మాట్లాడారు. అనంతరం జైలు పరిసర ప్రాంతాలు పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఖైదీలకు తాగడానికి వేడినీరు ఇవ్వాలని జైలు సూపరింటెండెంట్ బి.జోగులుకు సూచించారు. ఈ కార్య క్రమంలో హెడ్‌వార్డర్ జి.రమణయ్య, బి.విజయకుమార్, జిపిటినాయుడు, నరసింహులు, హరికృష్ణ పాల్గొన్నారు.

మక్కువ నుంచి ఆర్టీసీ బస్సుల నిలిపివేత

మక్కువరూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మక్కువ నుంచి సాలూరుకు వెళ్లే మార్గంలో ఆర్టీసీ బస్సులను సంస్థ అధికారులు నిలిపివేశారు. మక్కువ నుంచి సాలూరు వెళ్లే మార్గంలో 20కిలో మీటర్ల రోడ్డు పాడైంది. దీంతో మక్కువ నుంచి సాలూరుకు బాగువలస మీదుగా వెళ్లే బస్సుల రాకపోకలను ఈనెల 16 నుంచిఆర్టీసీ నిలిపివేసింది. ఈ బస్సులను కవిరిపల్లి,శంబర, మామిడిపల్లి మీదుగా డైవర్ట్‌చేసి నడుపుతున్నారు. రోడ్డుపై రాళ్లు తేలడంతో రూటు మార్చినట్లు ఆర్టీసీ డ్రైవర్లు చెబుతున్నారు.

బోటు ప్రయాణాలు చేయకండి

వీరఘట్టం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడకెల్ల వద్ద నాగావళి నదిలో తహసీల్దార్ సాయి కామేశ్వరరావు ఆదేశాల మేరకు బోటు ప్రయాణం చేయవద్దని వీఆర్వో రాజేంద్ర గ్రామస్తులకు సూచించారు ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో నదీ ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, నదిలో బోట్లు వేయవద్దని యజమానులకు తెలిపారు.

దివ్యాంగుల ఫించన్లను పునరుద్ధరించాలి

పార్వతీపురంటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగులకు పింఛన్లను పునరుద్ధరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పార్వతీపురంలోని కలెక్టరేట్ వద్ద నిలిపివేసిన దివ్యాంగుల పింఛన్లు పంపిణీ చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 70 నుంచి 80 శాతం ఉన్న దివ్యాంగులకు వివిధ కారణాలతో పింఛన్లు నిలిపివేయడం సరికాదని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్య ప్రత్యేక దృష్టి సారించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కుండపోత

(5వ పేజీ తరువాయి)

కొంత సమయం పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నీటి ప్రవాహం తగ్గే వరకు ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు గెడ్డ వద్దే నిరీక్షించాల్సి వచ్చింది. మరోవైపు బిడిందిగూడ, వజ్జాయిగూడ గ్రామాల్లో వరి పంట ముంపునకు గురైంది. అరటి, పసుపు, అల్లం, జీడి పంటలకు కూడ అపారనష్టం వాటిల్లినట్లు గిరిజన రైతులు వాపోయారు.

ఉధృతంగా నాగావళి

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో వరద ఉధృతి పెరుగుతూ వస్తోంది. సోమవారం పైప్రాంతం నుంచి 7 వేల క్యూసెక్కులు చేరగా.. స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు 8 వేల క్యూసెక్కులను విడుదల చేశారు. 105 మీటర్ల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 104.18 మీటర్ల మేర నీటి నిల్వ ఉంది. సాగునీటి అవసరాల కోసం ప్రధాన కాలువల నుంచి 1170 క్యూసెక్కులను సరఫరా చేస్తున్నారు. నదీ తీర ప్రాంతవాసులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ప్రాజెక్టు ఈఈ హెచ్.మన్మథరావు తెలిపారు.



భామిని: వర్షాలకు గురండి సెంటర్‌లో ఛిద్రమైన రోడ్డు

సొంత నేలపై ప్రవాసుల ఔదార్యం

(5వ పేజీ తరువాయి)

చేపడుతున్నారు. గ్రామానికి చెందిన యువకులకు చమురు రంగంలో ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన సాంకేతిక శిక్షణ ఇస్తున్నారు. అంతేకాదు, ఇలా శిక్షణ పొందిన వారికి గల్ఫ్ దేశాలలో ఉపాధి లభించేలా మార్గం సుగమం చేస్తున్నారు. అలాగే, గ్రామాలలో అంతరించిపోతున్న కులవృత్తుల పరిరక్షణకు ప్రవాసులు కృషి చేస్తున్నారు. కుగ్రామంలో పెరిగినా.. విద్య కారణంగానే తాము ఎదిగామన్న విషయాన్ని గుర్తుంచుకుని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో 'విజ్ఞాన వేదిక' పేరిట ఓ సభా వేదికను నిర్మించి ప్రారంభించినట్టు 'ఆశయ' బృందంలోని కీలక సభ్యుడు పల్లెం తేజ పేర్కొన్నారు. సౌదీలోని చమురు రంగంలో ఇంజనీర్‌గా పనిచేసే తేజ.. ఇక్కడి ప్రముఖ తెలుగు ప్రవాసీ సంఘమైన 'సాటా'కు ఈశాన్య ప్రాంత అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. తరచుగా బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం కారణంగా దేసూరిగడ్డ వాగు పొంగుతుంది. దీంతో రావుపల్లి గ్రామంలోని దాదాపు 400 ఎకరాల వరి పంట మునిగిపోయి రైతాంగం నష్టపోతోంది. ఈ సమస్యపై తేజ సహా ఇతర ప్రవాసీయులు,గ్రామస్థులు పార్వతీపురం జిల్లాకలెక్టర్‌ను కలిసి వరద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వాగుకు ఇరువైపుల ప్రహరీ నిర్మించాలని విన్నవించారు. 'ఆశయ'లో తేజతో పాటు దాసరి సూర్య నారాయణ(సౌదీ అరేబియా), గుంట్రెడి రాంబాబు(ఒమన్), సంబంగి హరికుమార్(ఖతర్), స్విట్జర్లాండ్ తెలుగుఅసోసియేషన్ అధ్యక్షుడు పొడుగు రామరావులు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరికి ఇదే గ్రామానికి చెందిన హైదరాబాద్‌లోని సీనియర్ కార్డియాలజిస్ట్ గుల్ల సూర్యప్రకాశ్ సమన్వయం చేస్తున్నారు.

మట్టి ఇళ్లలో ఉండవద్దు

● మండల ప్రత్యేకాధికారి ప్రశాంత్‌కుమార్

రామభద్రపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండలప్రత్యేకాధికారి జి.ప్రశాంత్‌కుమార్ కోరారు. సోమ వారం ఎనుబరువు తదితర గిరిజనప్రాంతాల్లో పర్యటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి ఇళ్లల్లో ఉండవద్దని సూచించారు. ఎనుబరువు సమీపంలో కొండవాగు పొంగిపొర్లుతుండడంతో రాకపోకలు సాగించవద్దని తెలిపారు. అనంతరం ఏడొంపులగెడ్డ ఆనకట్ట పరిశీలించారు. వాటర్ ట్యాంకులను కూడా క్లోరినేషన్ చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశిం చారు.కార్యక్రమంలో తహసీల్దార్ అజురఫీజాన్, హెచ్‌డీటీ గిరిధర్, హౌసింగ్ ఏఈ ఇరిగేషన్ ఏఈ ప్రవీణ్, వీఆర్వో రామకృష్ణనాయుడు పాల్గొన్నారు.

పీ-4 సర్వేపై తెలియజేయండి

బొబ్బిలి రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాభిప్రాయ సేకరణలో అందరూ పాలుపంచుకొని టీమ్ సభ్యులంతా ఎప్పటికప్పుడు పి-4 సర్వేపై అవుట్‌పుట్ తమకు తెలియజేయాలని డీడీవో ఎం.కిరణ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని పి-4 బంగారు కుటుంబాలు దత్తత నిమిత్తం పర్యవేక్షణ చేయడం కోసం ప్రత్యేక టీమ్ లీడర్‌గా యంగ్ ప్రొఫెషనల్ టు వర్క్ ఇన్ సీపీఏపీ తరుణ్ గౌతంను నియమిం చారు. సోమవారం బొబ్బిలిలో డీడీవో ఎం.కిరణ్‌కుమార్‌తో సమావేశమయ్యారు.ఈసందర్భంగా డీడీవో పి-4 సర్వేపై పలు సూచనలు చేశారు.అట్టడుగు కుటుంబాల వివరాలు తీసుకొని ఉన్నతంగా స్థిరపడిన వారి సహకారంతో వారి ఉన్నతికి చేయూత ఇవ్వనున్నట్లు తెలిపారు.